## క్లుప్తంగా

### నేడు రెండు మండలాల్లో విద్యుత్ కోత

గిద్దలూరు రూరల్: గిద్దలూరు, కొమరోలు మండలాల్లో గురువారం ఉదయం 7.30 నుంచి ఉదయం 10 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందని గిద్దలూరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వై. శేషగిరిరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిద్దలూరు 132 సబ్ స్టేషన్‌లో సాంకేతిక మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

### పంచాయతీ కార్యదర్శికి సన్మానం


కార్యదర్శి బ్రహ్మయ్యను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

కంభం: బదిలీపై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శిని బుధవారం కంభం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పల్నాటి బోడయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పంచాయతీ పాలకమండలి సభ్యులు, అధికారులు, పలువురు రాజకీయ నాయకులు కార్యదర్శిని సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ, ఎంపీడీఓ వీరభద్రాచారి, ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, ఉపసర్పంచ్ సయ్యద్ ఖాసిం, హజరత్‌గూడెం సర్పంచ్ మహబూబ్‌పీరా, చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీం, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

### 'మానవత' సంస్థకు సభ్యత్వ నగదు అందజేత


రిసిప్ట్‌లు, నగదు అందజేస్తున్న ఎంపీపీ మురళి

పొదిలి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు సభ్యత్వ నగదును కొనకనమిట్ల ఎంపీపీ మోరబోయిన మురళి తన మిత్రులతో బుధవారం అందజేశారు. ఎంపీపీ మిత్ర బృందం సభ్యత్వాలు నమోదు చేయించి సంస్థ కన్వీనర్ కె.యల్లమందారెడ్డికి అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం కన్వీనర్ ఏలూరి సంజీవరెడ్డి పాల్గొన్నారు.

### ఘనంగా హనుమాన్ నగరోత్సవం


ప్రత్యేక అలంకారంలో భక్తాంజనేయస్వామి

మార్కాపురం టౌన్: మూలా నక్షత్రం సందర్భంగా మండలంలోని ఎల్‌బీఎస్ నగర్‌లో భక్తాంజనేయ స్వామి 35వ నగరోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 12న ధనలక్ష్మి, పార్వతీదేవి అమ్మవార్లకు కుంకుమ పూజ నిర్వహించనున్నట్లు స్వామివారి సేవా సంఘం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో దాతలు ఇమ్మడిశెట్టి వెంకటేశ్వర్లు, కె రమేష్‌బాబు, రామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, వీవీ సుబ్బారావు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### వంట సహాయకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పొదిలి: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రెండు వంట సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేసే ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 15వ తేదీ వరకు గడువు ఉందని పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల వారు 47 ఏళ్లలోపు, మాజీ సైనికులకు 45 ఏళ్లు, దివ్యాంగులకు 52 ఏళ్లు, ఓసీలకు 42 ఏళ్ల వయో పరిమితి విధించినట్లు తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులతో పాటు పాస్‌పోర్టు ఫొటో, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లతో ఎంఈఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మార్కాపురం టౌన్: మార్కాపురం మండల పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్ పోస్టులకు ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓలు రాందాస్ నాయక్, శ్రీనివాసులు బుధవారం తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 15వ తేదీలోగా ఎంఈఓ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

తర్లుపాడు: మండలంలోని కలుజువ్వలపాడు కేజీబీవీలో అసిస్టెంట్ కుక్-3 , నైట్ వాచ్‌మెన్-1, స్కావెంజర్-1 పోస్టు భర్తీ చేయనున్నట్లు ఎంఈఓ సుజాత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈఓ కార్యాలయంలో ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# పండగకు పప్పన్నం లేనట్టేనా?


కందిపప్పు


రేషన్ తీసుకుంటున్న ప్రజలు

- మార్కాపురం నియోజకవర్గంలో రేషన్ దుకాణాలకు చేరని కందిపప్పు
- మార్కాపురం, పొదిలి ఎంఎల్ పాయింట్లకు 40 శాతమే సరఫరా
- కార్డుదారులకు బియ్యం పంపిణీ చేసిన తర్వాత రావడంతో డీలర్ల విముఖత
- బయట మార్కెట్‌లో కంది పప్పు కిలో రూ.190 పెట్టి కొనలేక పేదల అవస్థలు

మార్కాపురం:

కూటమి ప్రభుత్వంలో దసరా పండగ వేళ పేదలకు పప్పన్నం తినే యోగం లేకుండా పోయింది. నిత్యావసర సరుకుల ధరలు రాకెట్‌లా దూసుకెళ్తుండటంతో పేదలు ఓ పూట పస్తులుండాల్సిన దుస్థితి. రేషన్ దుకాణాల ద్వారా బియ్యం, కందిపప్పు, చక్కెర తదితర నిత్యావసరాలు ఇస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి గొప్పగా ప్రకటించి మూడు నెలలు దాటినా ఆచరణలో మాత్రం ఫలితం శూన్యం. ప్రభుత్వమే చక్కెర, కందిపప్పులో కోత విధించి డీలర్లకు పంపిణీ చేయడంతో కార్డుదారుల్లో సగం మందికి కూడా సరుకులు దక్కడం లేదు. కొందరు డీలర్లు కూడా తమకు ఇష్టమైనవారికి మాత్రమే కంది పప్పు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో రేషన్‌లో రూ.67కే కంది పప్పు ఇస్తారని ఆశించిన పేదలకు భంగపాటు తప్పలేదు. బయట మార్కెట్‌లో కిలో కందిపప్పు 190 రూపాయలు పెట్టి కొనుగోలు చేయలేమని, పండగనాడూ పచ్చడి మెతుకులతో సరిపెట్టుకోక తప్పదని పేదలు తమను తాము నిందించుకుంటున్నారు.

మూడు రోజులపాటు ఘనంగా సాగే దసరా పండగలో అమ్మవారికి నైవేద్యాలు పెట్టాలంటే చక్కెర, కందిపప్పు, బియ్యం కచ్చితంగా అవసరం. డీలర్లు బియ్యమైతే ఇస్తున్నారు కానీ చక్కెర, కంది పప్పులో కోత విధిస్తున్నారు. కార్డు వినియోగదారుల నుంచి మాత్రం చక్కెర, కందిపప్పు కూడా బియ్యంతోపాటు ఇచ్చినట్లుగా నమోదు చేసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**అమ్మో.. గొడవలైపోతాయ్..!**

మార్కాపురం తర్లుపాడు మండలాల్లో రేషన్ లబ్ధిదారులకు 45 టన్నుల కందిపప్పు సరఫరా చేయాల్సి ఉండగా 25 టన్నులు మాత్రమే అందించారు. మార్కాపురం పట్టణంలో కేవలం 40 శాతం దుకాణాలకు మాత్రమే కంది పప్పు సరఫరా చేశారు. దీంతో తమకు కంది పప్పు ఎప్పుడిస్తారని మిగిలిన వార్డుల్లో కార్డుదారులు డీలర్లను నిలదీస్తున్నారు.

పొదిలి, కొనకనమిట్ల మండలాల్లో రేషన్ లబ్ధిదారులకు సుమారు 40 టన్నుల కందిపప్పు సరఫరా చేయాల్సి ఉండగా 20 టన్నులు మాత్రమే వచ్చింది. డీలర్లందరికీ ఈ కంది పప్పు కొంత మేర అందించాలని ఎంఎల్ పాయింట్ అధికారులు ప్రయత్నించగా అందుకు వారు అంగీకరించలేదు. గ్రామాల్లోని రేషన్ కార్డుదారుల్లో కొందరికి కంది పప్పు ఇచ్చి, మరి కొందరికి ఆపితే వివాదాలు పొడచూపుతాయన్న ఉద్దేశంతో డీలర్లు ససేమిరా అనడంతో కంది పప్పు ఎంఎల్ పాయింట్ గోడౌన్‌లోనే ఉండిపోయింది.

**రేషన్ లబ్ధిదారుల వివరాలు**

| మండలం | రేషన్‌షాపులు | రేషన్ కార్డుదారులు |
|---|---|---|
| మార్కాపురం | 62 | 33,378 |
| తర్లుపాడు | 19 | 9,992 |
| పొదిలి | 37 | 18,650 |
| కొనకనమిట్ల | 30 | 14,971 |
| మొత్తం షాపులు | 148 | 76,991 |

# గోతులతో యాతన

- రాష్ట్రీయ రహదారిలో అడుగడుగునా గోతులు
- తీవ్రంగా ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

కొమరోలు: కడప-అమరావతి రాష్ట్రీయ రహదారి అడుగడుగునా గోతులమయంగా మారిపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. కొమరోలు మండల పరిధిలోని తాటిచెర్లమోటు నుండి తిమ్మారెడ్డిపల్లె గ్రామాల మధ్య మోకాలిలోతు గోతులు ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తిమ్మారెడ్డిపల్లె గ్రామ సమీపంలో వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. అలాగే అల్లినగరం గ్రామానికి ఇరువైపులా రాష్ట్రీయ రహదారి పూర్తిగా దెబ్బతింది. పామురుపల్లె గ్రామ సమీపంలో రహదారిపై, బాలిరెడ్డిపల్లె, పొట్టిపల్లె, తాటిచెర్ల గ్రామాల మధ్య హైవే మెటల్ రహదారిని తలపిస్తోంది. పాలకులు స్పందించి మరమ్మతులు చేయించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.


గుంతలమయంగా మారిన రాష్ట్రీయ రహదారి


తిమ్మారెడ్డిపల్లె వద్ద అధ్వానంగా రాష్ట్రీయ రహదారి

**రోడ్డెక్కాలంటే భయమేస్తోంది**



కడప-అమరావతి హైవేపై ప్రయాణించాలంటేనే భయంగా ఉంది. రాత్రి వేళ వేగంగా వెళ్తున్న వాహనదారులు భారీ గుంతలను గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు కింద పడి తీవ్ర గాయాలపాలవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ రహదారిని త్వరగా బాగు చేయించాలని కోరుతున్నాం.

– అబ్దుల్‌ఖాదర్, అల్లినగరం గ్రామం

# గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి


బేస్తవారిపేటలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రంగనాయకులు


పొదిలిలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శోభన్‌బాబు

పొదిలి రూరల్: గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని ఎంపీడీఓ గుత్తా శోభన్‌బాబు పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలపై అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ టి.శ్రీనివాసరెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

**నిధులు సక్రమంగా ఖర్చు చేయాలి**

బేస్తవారిపేట: పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసే నిధులు సక్రమంగా ఖర్చు చేయాలని ఎంపీడీఓ రంగనాయకులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉప సర్పంచ్‌లు, వార్డ్ మెంబర్లకు శిక్షణ ఇచ్చారు. గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులతోపాటు ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. పంచాయతీల ఆర్థిక వనరులను పెంచుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బీవీ రాజయ్య పాల్గొన్నారు.


మార్కాపురం: సర్టిఫికెట్లు అందిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ

మార్కాపురం రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచ్, వార్డు మెంబర్ల శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ఎంపీడీఓ భాగ్యవతి మాట్లాడుతూ గ్రామ పంచాయితీల్లో ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు కీలక పాత్ర వహిస్తారని చెప్పారు. అనంతరం వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# సేంద్రియ ఎరువులతో భూమికి సారం


కొమరోలు: రైతులతో మాట్లాడుతున్న ఏఓ రాజశ్రీ


మార్కాపురం: మాట్లాడుతున్న ఏడీఏ బాలాజీనాయక్

- ఏడీఏ బాలాజీ నాయక్

మార్కాపురం రూరల్: సేంద్రియ ఎరువుల వాడకంతో భూసారం పెరిగి దిగుబడి బాగుంటుందని ఏడీఏ బాలాజీ నాయక్ తెలిపారు. మండలంలోని రామచంద్రాపురం, కొండేపల్లి గ్రామాల్లో రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువుల వాడకంతో నేల బలహీనపడుతుందని చెప్పారు. ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు మాట్లాడుతూ ఆహార భద్రతతోపాటు పోషకాల పరంగా కూడా ఎంతో ప్రాధాన్యత ఉన్న చిరుధాన్యాలను సాగుచేయాలని సూచించారు. పండ్ల తోటల రాయితీ గురించి హెచ్ఓ రమేష్ వివరించారు. పశువైద్యాధికారి డాక్టర్ ఎస్ గౌరీశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

**కంది, మిరపలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి**

పొదిలి రూరల్: మండలంలోని ఓబులక్కపల్లిలో కంది, మిరప రైతులకు సస్యరక్షణపై ఏఓ ఎస్కే జైన్‌లాబ్దిన్ అవగాహన కల్పించారు. మిరప పంటలో ఆకు ముడత, కాయ కుళ్లు నివారణ చర్యలు, పెట్టుబడి తగ్గించుకునే మార్గాల గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


ఓబులక్కపల్లిలో పంటను పరిశీలిస్తున్న అధికారులు

గిద్దలూరు రూరల్: రైతులకు పప్పుశనగ విత్తనాలు 25 శాతం సబ్సిడీపై ఈ నెల 14 నుంచి అందించనున్నట్లు ఏఓ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. కొమ్మునూరు, పాదలకుంటపల్లె గ్రామాల్లో రైతులకు పంటల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూక్ష్మనీటి యాజమాన్య అధికారి మోహన్‌కృష్ణ, వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కొమరోలు: రబీ సీజన్‌కు సంబంధించి రాయితీపై శనగ విత్తనాలు అవసరమైనవారు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ కె.రాజశ్రీ తెలిపారు. దద్దవాడ, తాటిచెర్ల గ్రామాల్లో రైతులకు సూచనలిచ్చారు. ఉద్యానవన శాఖాధికారిణి విష్ణుప్రియ తదితరులు పాల్గొన్నారు.

# మద్యం దుకాణాల టెండర్ గడువు పొడిగింపు

- ఎక్సైజ్ ఏఈఎస్ బాలయ్య వెల్లడి

మార్కాపురం: మార్కాపురం ఎక్సైజ్ డివిజన్ పరిధిలోని 68 మద్యం షాపుల టెండర్ దరఖాస్తు గడువును ఈనెల 11వ తేదీ వరకు పొడిగించినట్లు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బాలయ్య తెలిపారు. ఈనెల 11వ తేదీ సాయంత్రం వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, 14వ తేదీ ఉదయం 8 గంటల నుంచి లాటరీ తీస్తామని పేర్కొన్నారు. సబ్ డివిజన్ పరిధిలోని మార్కాపురం, యర్రగొండపాలెం, కనిగిరి, గిద్దలూరు, కంభం ఎక్సైజ్ స్టేషన్లలో దరఖాస్తులు సమర్పించవచ్చని చెప్పారు. లైసెన్సుదారులు 16వ తేదీ నుంచి కొత్త దుకాణాలు నిర్వహించుకోవచ్చని స్పష్టం చేశారు.

### కాంట్రాక్టు కార్మికులను కొనసాగించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

మార్కాపురం టౌన్: మార్కాపురం పురపాలక సంఘంలో 20 ఏళ్లు ఇంజినీరింగ్ విభాగంలో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్నారని, వారిని తొలగించి కొత్తవారిని నియమించడం అన్యాయమని మున్సిపల్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సుబ్బరాయుడు, హరి తెలిపారు. బుధవారం మున్సిపల్ కమిషనర్‌కు కాంట్రాక్టు కార్మికుల తొలగింపుపై వినతిపత్రాన్ని అందజేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి అనంతరం కమిషనర్ నారాయణరావుకు కాంట్రాక్టు కార్మికులు వినతిపత్రాన్ని అందజేశారు.

### రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి

పొదిలి రూరల్: రైతులు తమ పొలాల్లో సాగు చేసిన పంట వివరాలను వెంటనే ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని కనిగిరి ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి తెలిపారు. పొదిలి మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో నమోదు చేసిన వివరాలను బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి, ఏవో ఎస్కే జైన్‌లాబ్దిన్, ఇన్‌చార్జ్ ఆర్ఐ కెసుబ్బారావు, రైతులు పాల్గొన్నారు.



# సరస్వతీ నమస్తుభ్యం


బేస్తవారిపేట : సరస్వతీదేవిగా వాసవీమాత


రాచర్లలో సరస్వతి దేవి అలంకరణలో అమ్మవారు


పొదిలి: సరస్వతీదేవిగా వాసవీ మాత


గిద్దలూరు : సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు


మార్కాపురం శివాలయంలో కాళరాత్రి అలంకారంలో అమ్మవారు


గొట్లగట్టు రామాలయంలో..


కొమరోలు : సరస్వతిదేవి అలంకరణలో అమ్మవారు


కంభంలో సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు

బేస్తవారిపేట: మార్కాపురం డివిజన్‌లో దసరా శరన్నావరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బేస్తవారిపేటలోని వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో, కోటసత్యమాంబదేవి ఆలయంలో, సోమవారిపేటలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పాపాయిపల్లె, బేస్తవారిపేట పోలేరమ్మ ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉభయదాతలతో నిత్యపూజలు, మంగళహారతి పూజలు నిర్వహించారు.

గిద్దలూరు రూరల్: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నల్లబండ బజారులోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. కాశినాయన కుంట ఆవరణలోని గాయత్రిమాత ఆలయంలో గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరన్నబావి సమీపంలో కాశికాంబ ఆలయంలో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

**కంభంలో..**

కంభం: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం కంభంలో వాసవీమాత అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రికి ఆలయం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

**రాచర్లలో..**


కోలభీమునిపాడు వద్ద ముద్దసానమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న కమిటీ సభ్యులు

రాచర్ల: మండల కేంద్రమైన రాచర్ల గ్రామంలోని రామాలయంలో బుధవారం సరస్వతి దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

కొమరోలు: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. ఉదయం పెద్ద సంఖ్యలో మహిళలు కళశాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

పొదిలి: స్థానిక వాసవీ మాత ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని వివిధ ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మార్కండేశ్వరస్వామి ఆలయంలో జగదాంబ అమ్మవారు కాళరాత్రిగా, శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

మార్కాపురం రూరల్: మార్కాపురం మండలం కోలభీమునిపాడు వద్ద ముద్దసానమ్మ ఆలయంలో అమ్మవారిని పండ్లతో అలంకరించి పూజలు చేశారు.

కొనకనమిట్ల: దసరా మహోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని గొట్లగట్టు రామాలయం, కొనకనమిట్ల రామదూత క్షేత్రం, పెదారికట్ల శివాలయం, మహాలక్ష్మమ్మ ఆలయం, రేగడపల్లి వెంకటేశ్వరస్వామి, వద్దిమడుగు యల్లమ్మతల్లి ఆలయాల్లో వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయాల్లో బుధవారం అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. నందనమారెళ్ల బాలత్రిపుర కోటేశ్వరస్వామి ఆలయంలో చండీయాగం, రుద్రయాగం, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.